సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి



సీఎం జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలికేందుకు తరలి వచ్చిన 25 వార్డు మహిళలు



జగన్ మోహన్‌రెడ్డి సెల్ఫీ : ఆనందంలో పార్టీ నేతలు



పోర్టు ఆస్పత్రి వద్ద ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు తరలివచ్చిన మహిళలు

ఆత్మీయ నేతకు నీరాజనం



సీఎంకు స్వాగతం పలికేందుకు వేచి చూస్తున్న నాయకులు నీలి రవి, కర్రి రామారెడ్డి

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అఖండ స్వాగతం లభించింది. ఉత్తర నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గ పరిధి కైలాసపురంలో సుమారు రూ.600 కోట్లతో నిర్మించనున్న ఇనార్బిట్‌మాల్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన తమ అభిమాన నాయకుడికి మహిళలు నీరాజనం పలికారు. విమానాశ్రయం నుంచి పోర్టు ఆస్పత్రి కూడలి వరకు వేలాదిమంది మహిళలు మానవహారంగా నిలిచి అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. జై జగన్ అంటూ సీఎం కాన్వాయ్‌పై మహిళలు పూల వర్షం కురిపించారు. సీఎం జగన్‌ను చూసేందుకు వేల సంఖ్యలో మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ ఛైర్మన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతానికి భారీ ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయం నుంచి ఇనార్బిట్‌మాల్ ప్రాంతం వరకు ఫ్లెక్సీలు, కటౌట్లు, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని 17 వార్డుల నుంచి మహిళలు, పొదుపు సంఘాల సభ్యులు, ఆర్పీలు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ప్రతి ఇంటికి మేలు జరిగిందని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ముక్తకంఠంతో నినాదాలు చేశారు.

ఉప్పొంగిన అభిమానం

ఉత్తర నియోజకవర్గంలోని 25, 26, 43, 44 వార్డుల నుంచి మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయా వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షు లు అధ్వర్యంలో పోర్టు ఆస్పత్రి కూడలి వద్ద సీఎం చిత్రపటాలు, పువ్వులు పట్టుకుని జై జగన్ అంటూ నినాదాలు చేశారు. సీఎం కాన్వాయ్ సమీపంలోకి రాగానే తమ అభిమాన నాయకుడిని చూడటానికి పోటీపడ్డారు. కాన్వాయ్‌పై పూల వర్షం కురిపించారు.

సీఎంకు కేకేరాజు సత్కారం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురంలో రహేజా గ్రూప్ నిర్మించనున్న ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కేకే రాజు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రిని శాలువాతో, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

తాటిచెట్లపాలెం కూడలిలో..

కంచరపాలెం: విశాఖ వచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి తాటిచెట్లపాలెం కూడలిలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ నేతృత్వంలో మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. సీఎంకు అడుగడుగునా వార్డు మహిళలు, కార్యకర్తలు, అభిమానులు సీఎం కాన్వాయ్‌పై పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, వలంటీర్లు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఊర్వశి కూడలిలో..

కంచరపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఊర్వశి కూడలిలో 48వ వార్డు వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ నీలి రవి, సినీయర్ నాయకుడు కర్రి రామారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రాంబాబు, భూలోక్, డి.శ్రీను, పద్మ, అప్పారావు, హేమంత్, సత్యనారాయణరెడ్డి, రవి, గంగరాజు, రామా నాయుడు, గణేష్, గోపి, గిరి, పార్వతి, ఆసీనాబేగం, ఉషా భరత్, ఈశ్వరరావు, పి.రామ్మోహన్‌రెడ్డి, రాజేష్, అనిల్, సాయి, డానియల్ ఉన్నారు.



సీఎం జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

ఆజ్మీర్ నుంచి తీసుకొచ్చిన టోపీ అందజేత



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి టోపీ బహూకరిస్తున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ కేవీ బాబా

సీతంపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ కేవీ బాబా ఆజ్మీర్ నుంచి తీసుకువచ్చిన టోపీ, తువ్వాలు బహూకరించారు. జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం కావాలని ఆజ్మీర్‌లో ప్రార్థనలు చేసి తెచ్చిన టోపీ, తువ్వాలు జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో బహూకరించడం చాలా ఆనందంగా ఉందని బాబా తెలిపారు.

ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద...

మద్దిపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవీఎంసీ 50,51,53వ వార్డులకు చెందిన మహిళలు, అభిమానులు ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. సీఎం రాగానే పూల వర్షం కురిపించారు. వెల్‌కం సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. సమన్వయకర్త,నెడ్‌క్యాప్ ఛైర్మన్ కేకే రాజు,వార్డు కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీలు పాల్గొన్నారు.



ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద పోస్టర్లతో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

క్లుప్తంగా

వైభవుడికి పంచామృతాభిషేకం



ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అధిక శ్రావణ పూర్ణిమ పూజా కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారికి పంచామృతాభిషేకం చేశారు. ఉదయం ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలు, భక్తులు మంగళధ్వనితో వేదమంత్రోచ్చరణల మధ్య అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిగింది. అర్చక స్వామి శేషచార్యులు ప్రధాన అర్జిత సేవలో పాల్గొన్న దాతలకు శ్రీవారి శాలువా, కండువా బ్లౌజ్, స్వామి వారి చిత్రపటాన్ని అందజేసినట్టు కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ చెప్పారు.

ఉర్దూ పాఠశాలకు పార్ట్‌టైం టీచర్ నియామకం



పార్ట్‌టైం టీచర్‌ను హెచ్‌ఎంకు పరిచయం చేస్తున్న హబీబ్

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు ముస్లింతాటిచెట్లపాలెంలో ఉన్నజీవీఎంసీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉర్దూ సబ్జెక్టు బోధించడానికి ఆ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, ఈ క్యూబా మసీద్ ప్రెసిడెంట్ మహమ్మద్ హబీబ్ పార్ట్‌టైం టీచర్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఉర్దూ బోధించడానికి ఇక్కటీచరే ఉండటంతో వహీదా అను మరొక టీచర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆవాజ్ విశాఖ జిల్లా కమిటీ ఆర్థిక సాయంతో టీచర్‌ను ఏర్పాటు చేసినట్టు ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎం.డి.ఆయూబ్ తెలిపారు. దీనికి అనుమతి ఇచ్చిన పాఠశాల హెచ్‌ఎం పి.శాంతి కుమారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు మునీర్ మహ్మద్, ఉర్దూ ఆచార్యులు మహమ్మద్ వసీం రెహమాన్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పౌర్ణమి పూజలు



అన్నదానంలో పాల్గొన్న అప్పలరెడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకుడు రామారావు శర్మ ఆధ్వర్యంలో ఉమానీలకంఠేశ్వరుడికి పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో జోగుతున్న 12 మందికి రిమాండ్

పీఎం పాలెం: గంజాయి మత్తులో జోగుతున్న 12 మందిని పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం రాత్రి మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలో గంజాయి రవాణా చేస్తున్న లక్ష్మణ, కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు ఇచ్చిన సమాచారంతో దేవీమెట్ట ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న అనిల్ కుమార్, నరసింహారావు, శెట్టి, భవానీ ప్రసాద్, మహమ్మద్ ఇర్ఫాన్, వెంకటేశ్, శ్రీను, నరేష్, బెహరాతోపాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి చిన్నచిన్న గంజాయి ప్యాకెట్లు, 7 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ వై.రామకృష్ణ తెలిపారు.

బాధిత బాలుడికి రూ.లక్ష చెక్కు

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం బాపూజీనగర్‌లో నివాసం ఉంటున్న జి.సంతోషి కుమారుడు ఎముకల వ్యాధితో చిన్నప్పటి నుంచి ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు దృష్టికి తీసుకెళ్లింది. సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి బాధిత బాలుడుకు రూ.లక్ష వైద్య ఖర్చుల కోసం మంజూరు చేశారు. అ చెక్కును బాధిత బాలుడు తల్లి సంతోషికి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, మొక్క రమణ, కంటిపాము గురువోజీ, తదతరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంటిపాము కామేశ్వరి

నవరస మూర్తికి 'సురభి బాబ్జి' పురస్కారం

సీతంపేట: రంగసాయి నాటక సంఘం 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పౌరగ్రంథాలయంలో జరిగిన ఈ వేడుకల్లో సురభి బాబ్జి సేవా పురస్కారాన్ని ప్రముఖ నటులు, దర్శకుడు, నాటక రచయిత పీవీ రమణమూర్తి (నవరస మూర్తి)కి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గంటి సాయి శివ, కార్తికేయ ప్రదర్శించిన కీచకుడు, సంజయుడు ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షులు ఎస్.విజయ్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రంగస్థల నటులు దండు నాగేశ్వరరావు, బొట్టా వేణు, బొబ్బ ధవళేశ్వరరావు, చలసాని కృష్ణప్రసాద్, కొణతాల రాజు, బాదంగీర్ సాయి, మీగడ రామలింగస్వామి, మీగడ శోభూషణ్, కె.వెంకటేశ్వరరావు, మేడా మస్తాన్‌రెడ్డి, జర్నలిస్టు ఎస్.ఎస్.ఆర్ తదితరులు పాల్గొన్నారు.



నవరస మూర్తికి పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న ది పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

0సీతమ్మధార: నేషనల్ పేపర్ డే సందర్భంగా ది పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతమ్మధార, పిఅండ్‌టి కాలనీలోని జీవీఎంసీ నెహ్రూ మున్సిపల్ ప్లస్ టూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు అసోసియేషన్ ప్రతినిధులు ఎల్.రామచంద్రరావు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం సీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ అంకిత మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జి.బి.ప్రియదర్శిని, భవాని, కె.సంధ్యారాణి, పేరెంట్స్ కమిటీ రఘు, ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

డీఈవో చంద్రకళ ఆకస్మిక తనిఖీ

కంచరపాలెం: జీవీఎంసీ ధర్మానగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ, శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ మంగళవారం సందర్శించారు. ఆయా పాఠశాలలో జరుగుతున్న సీబీఎ-1 పరీక్షలను పరిశీలించారు. పాఠశాలలో తరగతుల నిర్వహణ, సిలబస్, పిల్లల నోట్ బుక్స్, వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు సక్రమంగా నోట్ బుక్స్ దిద్దకపోవడంతో ఉపాధ్యాయులపై మండిపడ్డారు. ధర్మానగర్, తిక్కవానిపాలెం ఉపాధ్యాయులకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఇచ్చారు. ఉపాధ్యాయులు విధిగా డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు.



నోట్ బుక్స్ పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

ఎండీఎం కార్మికులకు నిధులు పెంచాలి

డాబాగార్డెన్స్: మధ్యాహ్న భోజన పథక (ఎండీఎం) కార్మికులకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి కోరారు. యూనియన్ 4వ జిల్లా మహాసభ మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది ఉన్నారని, విశాఖలో 900 మంది ఉన్నారన్నారు. వీరి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకుంటే సెప్టెంబర్ 8న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం 31 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షురాలిగా ఎస్.సీతాభవాని, ప్రధాన కార్యదర్శిగా జి.మంగశ్రీ, కోశాధికారిగా కె.కళాచందనతోపాటు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డ్రగ్స్‌తో యువత భవిష్యత్తు నాశనం



అవగాహన కల్పిస్తున్న కంచరపాలెం పోలీసులు

మద్దిపాలెం: మత్తు పదార్థాలు సేవించడం వల్ల యువత భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుందని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎస్.సాయి అన్నారు. ఈ మేరకు కైలాసపురంలోని కస్తూరినగర్ జంక్షన్‌లో యువతకు, ప్రజలకు మంగళవారం ప్రత్యేక వాహనం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్‌కు, మద్యానికి, చెడు అలవాట్లకు దూరంగా యువత ఉండేలా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిత్యం నిఘా ఉంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవికిషోర్, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మి దుర్గమ్మకు పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

సీతమ్మధార : పౌర్ణమి సందర్భంగా శ్రీమహాలక్ష్మి దుర్గమ్మ అమ్మవారికి మంగళవారం పంచామృతాభిషేకాలతో పూజలు చేశారు. అర్చకుడు రాజా స్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. కార్యక్రమంలో సిబ్బంది శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మోహన్

సీతంపేట: ఉత్తర నియోజకవర్గం 43వ వార్డు టీడీపీ నాయకుడు బొడ్డేటి మోహన్ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రతిపాదన మేరకు విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45 వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం జాతీయ రహదారి సమీపంలోని సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అధిక సంఖ్యలో భక్తులు దర్శనాలు చేసుకున్నారు. ఆలయ అర్చకులు అల్లవరపు వెంకట ఏకాంబరేశ్వరస్వామి పూజలు నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు

జోన్–5లో 92 శాతం పింఛన్ల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో 24 వార్డులకు సంబంధించి సుమారు 92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని యూసీడీ ఏపీడీ చిరంజీవి తెలిపారు. జోరువానలోనూ పింఛన్ల పంపిణీ జరిగింది. లబ్ధిదారులకు సచివాలయ కార్యదర్శుల సమక్షంలో వలంటీర్లు పింఛన్లు అందజేశారు. జోన్ పరిధిలో మొత్తం 26,354 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మరో రెండురోజుల్లో 100 శాతం పూర్తి చేయాలని జోన్–5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

రామాయణం మహాకావ్యం



హాజరైన భక్తులు



ప్రసంగిస్తున్న ప్రముఖ రచయిత డాక్టర్ డీవీ సూర్యారావు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో ప్రముఖ రచయిత డాక్టర్ డీవీ సూర్యారావు 'రామాయణంలో సోదరానుబంధం'పై ప్రసంగించారు. రామాయ ణం జాతీయ మహా కావ్యమని, జాతి యొక్క సంస్కృతి, సనాతన ధర్మాన్ని అద్దం పట్టే విధంగా రామా యణాన్ని విశ్వకవి వాల్మీకి అందించారన్నారు. సకల ధర్మాలు, కుటుంబంలోని సంబంధాలు ఎలా ఉండాలో రామాయణంలో తెలియజేశా రన్నారు. భారతీయ సమాజంలో కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని, మన సంస్కృతి బలంగా ఉండడానికి కుటుంబ వ్యవస్థే కారణమన్నారు. రామాయణంలో నాలుగు చోట్ల అన్నదమ్ముల అనుబంధం కన్పిస్తుందన్నారు. అయోధ్యలో రామలక్ష్మణ, భరత శతృఘ్నులు, కిష్కిందలో వాలిసుగ్రీవులు, లంకలో రావణ విభీషణులు, అలాగే పక్షి సోదరులు సంపాతి, జటాయువులు అన్నదమ్ముల గురించి వివరించారు. లలితానంధభారతీ స్వామి మాట్లాడుతూ లలితాపీఠం అధ్యాత్మిక విశ్వవిద్యాలయమని కొనియాడారు. ఇక్కడ నిత్యం హోమాలు, ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలు, సాహిత్య కార్యక్రమాలు జరుగుతుండటం విశేషమన్నారు. త్వరలో లలితాపీఠంలో నన్నయ్య సహస్రాబ్ది ఉత్సవాలు జరగనుండటం అభినందనీయమన్నారు. అనంతరం లలితాపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.

పచ్చదనం పెంపునకు 'మా'వాకర్స్ సహకారం

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ పార్కులో పచ్చదనం పెంపునకు 'మా'వాకర్స్ క్లబ్ సభ్యులు ముందుకు వచ్చారు. వాకర్స్ పార్కును అమితంగా అభిమానించే వీరు పార్కులో మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఈ మేరకు పార్కు సుందరీకరణకు అవసరమైన రూ.4 వేలు విలువైన 60 మొక్కలను వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళికి మంగళవారం అందించారు. మా వాకర్స్ సభ్యులకు వాకర్స్ క్లబ్ తరుపున అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి కృతజ్ఞతలు తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, మా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అన్నెపు దామోదర్, ఎస్.విశ్వనాథం, పి.అప్పలనాయుడు, సర్వరాజ్, వాకర్స్ క్లబ్ జాలీవాకర్ ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.



వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చంద్రమౌళికి మొక్కలు అందిస్తున్న మా వాకర్స్ ప్రతినిధులు

ఉదయమే ఇంటింటికీ క్లాప్ వాహనం వెళ్లాలి

జగదాంబ: ఉదయం 6 గంటలకే చెత్త సేకరణకు ఇంటింటికీ తప్పకుండా క్లాప్ వాహనం వెళ్లాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన జోన్ పరిధిలోని వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం లక్ష్యంగా ఇంటింటికీ క్లాప్ వాహనం వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
✆ 8309817091

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
✆ 9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com